ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

ఆదివారం 6 ఏప్రిల్ 2025

సీతారాము జైజై..!

నేడు శ్రీరామ నవమి



అనంతపురం పాతూరు మార్కెట్‌లో పండుగ రద్దీ

శ్రీరామ నవమి వేడుకలకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. కాషాయ జెండాలు, విద్యుద్దీపాలలతో ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. సీతారాముల కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు రథాలను సిద్ధం చేశారు. పూలు, పండుగ సామగ్రిని కొనేందుకు వచ్చిన జనంతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. పండుగను పురస్కరించుకుని ఆలయాలకు ఆదివారం వచ్చే భక్తుల రద్దీని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆదివారం ఉదయం 10 గంటలకు రాములవారి నగరోత్సవం, భక్తుల మెగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్





పాతూరు సున్నపువీధిలో విద్యుద్దీపాలంకరణలో రామస్వామి గుడి, శ్రీనివాసనగర్ రామాలయంలో సీతారామ లక్ష్మణులు



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు

ఉద్యాన శాఖకు దిక్కెవరు..?

ఏడాదిగా ఇన్‌చార్జి డీడీ పాలన

అనారోగ్యంతో ఆయనా సెలవు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖకు జిల్లాలో పెద్ద దిక్కు లేకుండా పోయింది. ఏడాదికిపైగా ఇన్‌చార్జి పాలనలోనే ఆ శాఖ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. డీడీ రఘునాథరెడ్డిని గత ఏడాది మార్చిలో ఏపీఎంఐపీ పీడీగా నియమించారు. అప్పటి నుంచి ఏడీ నరసింహారావుకు ఇన్‌చార్జి డీడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడీ, డీడీ బాధ్యతలను ఆయనే చూడాల్సి వస్తోంది. ఈ క్రమంలో పని ఒత్తిడితో ఆయన అనారోగ్యానికి గురయ్యారని సమాచారం. వారం క్రితం ఆయన నెల రోజుల సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ఎవరికీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు. ప్రభుత్వ శాఖలకు రెగ్యులర్ ఉన్నతాధికారులు ఉండాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ భావన. ఆ దిశగా పలు శాఖలకు ఆయన రెగ్యులర్ అధికారులను నియమించేలా చర్యలు తీసుకున్నారు. కానీ ఉద్యానశాఖ గురించి పట్టించుకోలేదు.



నరసింహారావు (ఫైల్)

హార్టికల్చర్ హబ్ ఎలా..?

అనంతను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పం. కలెక్టర్ ఆధ్వర్యంలో ఇటీవల అనంత ఉద్యాన సమ్మేళనం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఏడు కంపెనీలతో ఒప్పందం కుదుర్చున్నారు. ఆ కంపెనీల ప్రతినిధులతో గత నెలలో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే మూడు నెలల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టనున్నారో విచారించారు. వాటిపై సమగ్ర నివేదికలు తయారు చేసి, క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల నుంచి పనులు మొదలు పెట్టేలా ప్రణాళికలు రూపొందించారు. ఉద్యాన సమ్మేళనంలో గ్రోత్ ఇంజన్ జాబితాలో అరటి, చీనీ, దానిమ్మ, ఎండు మిరప, టమోటా పంటలు ఉన్నాయి. ఇంతటి కీలకమైన పనులు ఉద్యాన శాఖ పరిధిలో జరుగుతున్న సమయంలో రెగ్యులర్ ఉన్నతాధికారి లేకపోవడం ఇబ్బందికరమని పలువురు అంటున్నారు.



ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయం

జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిద్దాం

● రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ● ఘనంగా 118వ జయంతి వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై సప్తగిరి సర్కిల్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేశవ్ మీడియాతో మాట్లాడుతూ... బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తిని గుర్తు చేసుకోవడానికి, భావితరాలకు ఆయన ఆలోచనలను పంచడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. తొలి కేబినెట్ నుంచి రాజకీయాల్లో ఉన్నంత కాలం మంత్రిగా పనిచేసిన నాయకుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. చివరి శ్వాస వరకూ నమ్మిన సిద్ధాంతాల కోసం కట్టుబడిన వ్యక్తి అన్నారు. జడ్పీలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ... బాబు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తి, ఆదర్శంతో వివిధ ప్రభుత్వ పథకాల అమలులో అనంత జిల్లా ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ మేయర్ స్వరూప, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, రాయల్ మురళీ, విశాలాక్షి, స్వామిదాస్, వెంకటేష్, సిమెంట్ పోలన్న, పోతుల లక్ష్మీనరసింహులు, కొండన్న, పరమేశ్వరన్ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డ్వామాలో పలువురి బదిలీ

తాడిపత్రి ఏపీడీగా పుల్లారెడ్డి

గుత్తికి అయేషా, సీబీకి విజయ్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డ్వామాలో పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీచేశారు. తాడిపత్రి క్లస్టర్ ఏపీడీగా పుల్లారెడ్డి నియమితులయ్యారు. పెద్దవడుగూరు ఏపీఓగా ఉన్న పుల్లారెడ్డికి తాడిపత్రి క్లస్టర్ ఇన్‌చార్జి ఏపీడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక గుత్తి క్లస్టర్‌కి అయేషా, పీడీ కార్యాలయంలో ఉండే సీబీ విభాగం ఏపీడీగా, ఉరవకొండ క్లస్టర్ ఇన్‌చార్జి ఏపీడీగా విజయ్‌కుమార్‌ను బదిలీ చేశారు. డ్వామాలో 12 మంది ఏపీఓలు, 15 మంది ఈసీలు, 98 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 51 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, ముగ్గురు సిబ్బందిని బదిలీ చేశారు. సోమవారం సాయంత్రంలోపు బదిలీ చేసిన స్థానాల్లో ఉపాధి ఉద్యోగులు విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కసాపురంలో వెండి ప్రాకారోత్సవం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం రాత్రి వెండి రథోత్సవంలో స్వామి వారి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామి మూలవిరాట్‌కు పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను వెండి రథంలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి, అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.



వెండి రథంలో స్వామి వారు

అనంత ఆణిముత్యాలకు చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు కలెక్టర్ వినోద్‌కుమార్ చెక్కులను అందజేశారు. ఈ మేరకు శనివారం జడ్పీ సమావేశపు హాల్‌లో నిర్వహించిన బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పలువురు విద్యార్థులకు ఆయన చెక్కులను అందజేశారు. సొసైటీ కింద హార్టికల్చర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విజయలక్ష్మికి రూ. 25 వేలు, బ్యాంకు పరీక్షల కోచింగ్ కోసం విద్యార్థి డీఎస్ తరుణ్‌కి రూ. 10 వేలు, డిగ్రీ కాలేజీ రెండేళ్లఫీజు కోసం డి. అనూషకు రూ. 10 వేలు, బీబీఏ కాలేజీ రెండేళ్ల ఫీజు కోసం రాజాబాబుకు రూ. 25 వేలు, సివిల్స్ కోచింగ్ హాస్టల్ ఫీజు కోసం డీఆర్ గౌతమికి రూ. 25 వేలు చెక్కులను కలెక్టర్ అందజేశారు.

డోలమైట్ గనిలో పేలుడు

నలుగురు కూలీలకు తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు మండలం కొండుపల్లి సమీపంలోని డోలమైట్ గనిలో శనివారం పేలుడు సంభవించింది. భూగర్భంలో డ్రిల్లింగ్ చేస్తుండగా గతంలో అమర్చిన డిటోనేటర్లు పేలిపోయాయి. ఈ ప్రమాదంలో యాడికి మండలం తూట్రాళ్లపల్లికి చెందిన తలారి నాగయ్య, తలారి హరి, రామరాజుపల్లికి చెందిన కొండప్ప, పెద్దవడుగూరు మండలం కొండుపల్లికి చెందిన తిరుపాలు తీవ్రంగా గాయపడ్డారు. (వివరాలు మెయిన్‌లో)



ప్రమాద బాధితులను అనంతపురానికి తరలిస్తున్న దృశ్యం

మారనున్న చదువు

- డిగ్రీలో కొత్త కోర్సులు...! ● ఉద్యోగ కల్పనే ధ్యేయం
- కంపెనీల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు
- కోర్సు చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్
- విధివిధానాలు రూపొందిస్తున్న విద్యాశాఖ



అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డిగ్రీలో స్కిల్ బేస్డ్ కోర్సుల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థల ను గుర్తించి వాటికి అవసరమైనవిధంగా పాఠ్యాంశాలు రూపొందించేం దుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. గుర్తించిన సంస్థలతో ముందుగానే ఒప్పందాన్ని కుదుర్చుకుని కళాశాలలకు అనుసంధానం చేయనుంది. ఆ మేరకు కోర్సు చివరి సంవత్సరంలో విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేయించి అదే సమయంలో నెలకు రూ.20వేల వరకు ఉపకార వేతనం చెల్లించేలా సంబంధిత సంస్థ కళాశాలలతో ఎంఓయూ కుదుర్చుకోవాలి. ఇలా అనేక కోణాల్లో సానుకూల అంశాలను క్రోడీకరించి పకడ్బందీగా అమలు చేసేందుకు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షించి ప్రణాళికలు రూపొందించింది. అందుకు అనుగుణంగా విద్యాశాఖ విధివిధానలను రూపొందిస్తోంది.

గతమంతా గందరగోళం

గడిచిన ఐదేళ్లు విద్యా వ్యవస్థలో గందరగోళాన్ని సృష్టించారు. డిగ్రీలోని మూడు సబ్జెక్టులకు బదులుగా ఒక సబ్జెక్టునే ప్రధానం చేసి, రెండో ప్రాధాన్యంగా మరో సబ్జెక్టును ఎంచుకోండంటూ విద్యార్థుల్లో అయోమ యాన్ని రేకెత్తించారు. హానర్ డిగ్రీ చేసిన విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యు యేట్(పీజీ)లో ప్రవేశం పొందేందుకు గైడ్‌లెన్స్ రూపొందించలేదు. మరోవైపు తరగతులు నిర్వహణ, అధ్యాపకుల అడ్జెస్ట్‌మెంట్, టైంటేబుల్ ఇలా ప్రతిది నిబంధనలకు విరుద్ధంగా కొనసాగించారు. వీధుల్లోని కిరాణా కొట్లు, రిపేరీ షాపులు, తోపుడు బండ్ల వ్యాపారాలను సైతం కంపెనీలుగా గుర్తించి వాటిలో ఇంటర్న్‌షిప్ చేయాలని విద్యార్థులకు లిస్ట్ ఇచ్చారు. వీటికి తోడు మూడు నెలలకు ఒక సెమిస్టర్ నిర్వహిస్తేనే ప్రపంచ దేశాలతో పోటీపడతామని కబుర్లు చెప్పారు. చివరికి ఏదీ ఫలితాన్ని ఇవ్వలేదని అధ్యాపక వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయి. గతంలో సృష్టించిన గందరగోళం నుంచి బయటపడటానికి నానాకష్టాలు పడాల్సి వస్తోందని వాపోతున్నాయి.

నైపుణ్యానికే జై...

నిర్వీర్యమైన ఉన్నత విద్యావ్యవస్థను నైపుణ్యంతో పునర్నించేలా రాష్ట్ర విద్యాశాఖ ముందుకెళ్తోంది. స్కిల్డ్ బేస్డ్ కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థుల్లో నైపుణ్య మెలకువలు పెంపొందించేలా భవిష్యత్తును నిర్మి స్తోందని కళాశాలల అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మానవాళికి అవసరమైన ప్రతి వినియోగ వస్తు తయారీ, ముడిసరుకు నుంచి వస్తు ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్, రీ-ప్రొడక్షన్ అన్ని ప్రక్రియలను సద్వినియోగం చేసుకునేందుకు వాటికి అవసరమైన నైపుణ్యాలను అందించేలా కొత్త కోర్సులు రూపొందుతున్నాయని వివరిస్తున్నాయి. కంపెనీలు, కళాశాలలను అనుసంధానం చేసి మార్కెట్, ఇండస్ట్రీయల్ ఓరియంటెడ్ కోర్సులు ప్రవేశపెడతారు. చివరి సంవత్సరంలో పరిశ్రమల్లోకి ఇంటర్న్‌షిప్‌కు వెళ్లే విద్యార్థులకు ఉపకార వేతనం చెల్లిస్తారు. సంస్థను బట్టి నెలకు రూ.5వేల నుంచి రూ.20వేల వరకు ఉపకార వేతనం చెల్లిస్తారు. కచ్చితంగా ఆర్నెళ్లు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

అటానమస్, న్యాక్...?

కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలంటే అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కళాశాలలో ఉండాలి. అటానమస్ కళాశాలలా? న్యాక్ ఏ గ్రేడున్న కళాశాలలా? అన్ని కళాశాలలా? అన్న తర్జనభర్జన సాగుతోంది. కోర్సు ప్రవేశపెట్టిన తరువాత అధ్యాపకులకు శిక్షణ ఇవ్వాలి. ప్రాక్టికల్స్‌కు అవసరమైన సదుపాయాలు ఏర్పాటుచేయాలి. అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలి. పరీక్షల నిర్వహణ, ఎవాల్యుయేషన్, మార్కుల గ్రేడింగ్ తదితర ప్రక్రియలు సమీక్షించుకోవాలి. సంపూర్ణస్థాయిలో వసతులు సమకూర్చుకున్న కళాశాలలో కొత్త కోర్సులు ప్రవేశపెడితే సత్ఫలితాలు వస్తాయని అధ్యాపక వర్గాలు పేర్కొంటున్నాయి.

శుభ పరిణామం



ఉద్యోగ కల్పనే ధ్యేయంగా డిగ్రీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. గత కొన్నేళ్లుగా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోయాయి. పూర్వ వైభవం సాధించేలా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులకు రూపకల్పన చేసి ప్రవేశపెట్టాలనుకోవడం శుభ పరిణామం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సంపూర్ణస్థాయి మౌలిక సదుపాయాలున్నాయి. 2014-18వరకు రూసా వంటి నిధులతో ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. అధునాత భవనాలు నిర్మించారు. తగిన అధ్యాపకులున్నారు. కొత్తకోర్సుల ప్రవేశానికి అన్నివిధాలా అనుకూలంగా ఉన్నాయి.

- రామకృష్ణ, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఏ దారైనా అంతే..!

నత్త నడకన ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణం

- ఏళ్ల తరబడి సాగుతున్న పనులు ● ప్రయాణికులకు తప్పని తిప్పలు ● భూసేకరణే అసలు సమస్య
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారులను కలిపే ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్ల తరబడి పనులు జరుగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూసేకరణలో అధికారుల అలసత్వంతోనే పనులు నిదానంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం న్యూటౌన్

భూసేకరణలో జాప్యంతో ముందుకు సాగని పనులు

జిల్లాలో ఆర్అండ్‌బీ ద్వారా చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులకు అవసరానికి అనుగుణంగా నిధులు కేటాయించారు. అయితే కొందరు అధికారుల అలసత్వం, పలు విభాగాల సమన్వయ లోపంతో భూ సేకరణలో జాప్యం జరుగుతోంది. అందుకే పనులు సకాలంలో పూర్తి కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కొన్ని ఉదాహరణలు

గోరంట్ల - హిందూపురం ఫోర్‌వే లేన్ 34 కిలోమీటర్ల నిర్మాణాన్ని రెండేళ్ల కిందట రూ.810 కోట్లతో ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ భూసేకరణ పూర్తి కాలేదు.

- తాడిపత్రి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.160 కోట్లతో రెండేళ్ల కిందట శ్రీకారం చుట్టారు. పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన పనులు పూర్తి కావడానికి ఇంకెన్నేళ్లు పడుతుందోనని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- ముదిగుబ్బ - పుట్టపర్తి రహదారి నిర్మాణం పనులు ఇప్పటి వరకూ 76 శాతం పూర్తి చేశారు. ముదిగుబ్బలో ఆర్వోబీ పనులు ప్రారంభిం చాల్సి ఉంది. ఇదే అసలైన సమస్యగా అధికారులు చెబుతున్నారు.
- రాప్తాడు ఆర్వోబీ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి. ఏడెనిమిదేళ్లు గడిచినా ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. 1.6 కి.మీ రోడ్డును రూ.98.55 కోట్లతో చేపట్టారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పూర్తి చేయడానికి ముందుకు రాలేదు. దీంతో టెండర్ రద్దు చేసి, నూతన టెండర్ పిలవనున్నారు. ఎప్పటికి పూర్తి చేస్తారన్నది తెలియాల్సి ఉంది.
- బత్తలపల్లి - ముదిగుబ్బ ఫోర్‌వే లైన్ నిర్మాణంలో భాగంగా అతి కష్టం మీద పనులు పూర్తి చేశారు. రాకపోకలకు అవకాశం కల్పించడంతో స్థానికులతో పాటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన పనులు

కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు జాతీయ రహదారుల నిర్మాణానికి కావల్సిన నిధులు కేటాయించింది. నిధుల కేటాయింపు జరిగి కొన్నేళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లింపు లేకపోవడం కూడా పనుల జాప్యానికి కారణంగా చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు బిల్లులు చెల్లింపులు లేకపోవడంతో పనులు పెండింగ్ పడిపోయాయి. ఎన్నికల తరువాత కూడ దాదాపు 3 నెలలు పాటు అదే తరహాలో జరిగిందన్న ప్రచారం ఉంది.





రాప్తాడు రైల్వే బ్రిడ్జి దుస్థితి..

ఉమ్మడి జిల్లాలో పనులను పరిశీలిస్తే..			
ఎక్కడి నుంచి ఎక్కడికి	దూరం (కి.మీ.)	నిధులు	పనుల పూర్తి శాతం
ముదిగుబ్బ - పుట్టపర్తి	32	రూ.402 కోట్లు	76
పులివెందుల - బి. కొత్తపల్లి	57	రూ.840 కోట్లు	62
పుట్టపర్తి - కోడూరు	47	రూ.1319 కోట్లు	50
తాడిపత్రి బైపాస్ రోడ్డు	38	రూ. 160 కోట్లు	65

వేగవంతం చేస్తాం: సుధాకర్‌రెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ



కొన్ని ప్రాంతాల్లో భూసేకరణలో జాప్యంతో పనులు కొంత ఆలస్యం అవుతున్నాయి. అన్ని విభాగాల అధికారులు సమష్టిగా చర్యలు తీసుకుని, పనులు వేగవంతం చేస్తాం. భూ సేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేశాం. పనులు మరింత వేగవంతం చేసి పూర్తి చేస్తామన్నారు.

- యూడీఐడీ కార్డుతో సేవలు సులభతరం
- దివ్యాంగులకు వరం యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు
- ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం
- 21 రకాల సేవలు పొందే అవకాశం

సదరం సమస్యలకు చెక్..!





యూడీఐడీ కార్డు ముందు భాగం... యూడీఐడీ కార్డు వెనుక భాగం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు, ఇతరత్రా సేవలకు సదరం స్థానంలో యూడీఐడీ(యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు)ని ప్రవేశపెట్టారు. గతంలో సదరం సర్టిఫికెట్ కోసం దివ్యాంగులు గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుంటే ప్రభుత్వం నిర్దేశించిన వైద్య శిబిరంలో వైద్యులు వైకల్య నిర్ధారణ అనంతరం సర్టిఫికెట్లను జారీ చేసేవారు. ఈ బాధల నుంచి దివ్యాంగులకు విముక్తి కల్పించేందుకు కేంద్రప్రభుత్వం యూడీఐడీ కార్డు అమలుకు శ్రీకారం చుట్టింది. సదరం సర్టిఫికెట్ స్థానంలో యూడీఐడీని పొందేందుకు http://swavlambancard.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో దివ్యాంగులు నేరుగా ఇంటి వద్ద నుంచే ఫోన్, ఇంటర్‌నెట్ సెంటర్, మీ-సేవా కేంద్రాల నుంచి కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు కల్పించింది.

మూడు లక్షల మందికి ప్రయోజనం

యూడీఐడీ కార్డు ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు మూడు లక్షల మంది దివ్యాంగులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు విడతల్లో 30 వేల మందికి ఈ యూడీఐడీ కార్డులను అందజేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి కార్డు ప్రయోజనాలు వివరిస్తున్నామన్నారు. సదరం శిబిరాల కోసం మీ-సేవతో పాటు యూడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు ఎప్పుడు హాజరుకావాలనే సమాచారం ఫోన్ నెంబర్‌కు మెసేజ్‌లు వస్తాయి. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో ఎలాంటి తప్పులు, అక్షర దోషాలు లేకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఐదు రకాల వైకల్యం ఉన్న వారికే మీ-సేవ ద్వారా సదరం శిబిరాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. అయితే యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల వైకల్యాలను చేర్చారు. తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు సదరం శిబిరాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. సదరం శిబిరంలో వైకల్యం నిర్ధారణ అయిన అనంతరం సర్టిఫికెట్లను స్మార్ట్‌కార్డు రూపంలో పోస్టల్‌శాఖ ద్వారా నేరుగా దివ్యాంగుల ఇళ్ల చిరునామాకు పంపుతారు. ఈ కార్డు ద్వారా పింఛన్లతో పాటు పలు సంక్షేమ ప్రయోజనాలు దేశవ్యాప్తంగా పొందే అవకాశం ఉంది. ఈ ఐడీ కార్డులను ఆన్‌లైన్ నుంచే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

దరఖాస్తు ఇలా...

గూగుల్‌లో http://swavlambancard.gov.in పోర్టల్ ఓపెన్ చేయగానే... అప్లయ్ బటన్‌పై క్లిక్ చేసి దరఖాస్తు ప్రక్రియలో సూచించిన అంశాలను పరిశీలించాలి. తరువాత దివ్యాంగుడు తన వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి. రెండో కాలమ్‌లో చిరునామా, గుర్తింపు కార్డు వివరాలు, శాశ్వత చిరునామా పొందుపరచాల్సి ఉంటుంది. మూడో కాలమ్‌లో వైకల్య వివరాలు, నాలుగో కాలమ్‌లో ఎంప్లాయిమెంట్, దివ్యాంగుని గుర్తింపు వివరాలు నమోదు చేయాలి. ఫొటో, వేలిముద్ర లేక సంతకం చేసి అప్‌లోడ్ చేసి సబ్‌మీట్ చేయడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. వైద్య పరీక్షల అనంతరం వెబ్‌సైట్‌లో అర్జీల స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకొనే అవకాశం ఉంటుంది.

యూడీఐడీ తప్పనిసరి



దివ్యాంగులకు రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందాలంటే యూడీఐడీ కార్డు తప్పనిసరి కానుంది. దివ్యాంగులకు ఇప్పటి వరకూ సదరం సర్టిఫికెట్లు జారీ చేసేవారు. ఆ స్థానంలో కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ కార్డుల జారీకి ప్రత్యేక పోర్టల్‌ను ఆవిష్కరించింది. ఆధార్ కార్డు తరహాలో కేంద్ర ప్రభుత్వం యూడీఐడీని ప్రవేశపెట్టింది. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఈ కార్డు పొందితే ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు సులభంగా పొందవచ్చు.

- వినోద్, ఏడీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ



గంజాయి పత్రి..!

> తాడిపత్రిలో ఐదురోజుల క్రితం గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గంజాయి మత్తులో పరస్పరం దాడులు చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ పోలీసులపైనే బూతు పురాణం అందుకున్నారు. అంతటితో ఆగకుండా ఏకంగా పోలీసు స్టేషన్‌పైనే రాళ్లు రువ్వాడు గంజాయి మత్తులో ఓ యువకుడు. అక్కడే నిలబడి పోలీసులను దుర్భాషలాడుతున్నా.. వారు చోద్యం చూశారే తప్ప.. చర్యలు తీసుకోలేదు. మద్యం మత్తులో ఉన్నాడంటూ చెప్పుకొచ్చారు. పోలీసు స్టేషన్‌పైనే రాళ్ల దాడి చేస్తున్నా.. అడ్డుకునే వారు లేకపోతే.. పట్టణంలో ప్రజలపై రక్షణ ఎవరు కల్పిస్తారని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.


> కృష్ణాపురం జీరో రోడ్డులో మూడునెలల క్రితం కళాశాల విద్యార్థినిని గంజాయి బ్యాచ్ కామెంట్ చేస్తుండగా.. అక్కడే ఉన్న ముగ్గురుబేల్దార్లు మందలించారు. వారిపై కూడా గంజాయి బ్యాచ్ రాళ్లతో దాడులు చేసింది. తీవ్రంగా గాయపడిన బేల్దార్లు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. నిరుపేదలైన ఆ కుటుంబీకులు వైద్యానికి లక్షల రూపాయలు వెచ్చించలేక దిక్కులు చూస్తున్నారు. ప్రస్తుతం పనిచేయడం చేతకాక, వైద్యఖర్చుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు.

> భగత్‌సింగ్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో గంజాయి బ్యాచ్‌కు సంబంధించిన వీడియో వైరల్ అయింది. వారిని ఇంత వరకు అరెస్టు చేసిన పాపానపోలేదు. పట్టణంలో ఇలాంటి ఘటనలు కోకొల్లలు అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మహమ్మారి మత్తులో యువకుల హల్‌చల్

- దారిన వెళ్లే వారిపై రాళ్ల దాడులు
- బాలికలు, మహిళల పట్ల అసభ్య ప్రవర్తన
- రోడ్లపై ప్రమాదకరమైన బైక్ స్టంట్లు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- పట్టించుకోని పోలీసులు

తాడిపత్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవలిగా గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోంది. యువత మహమ్మారి మత్తులో జోగుతున్నారు. బ్యాచ్‌లుగా ఏర్పడి గంజాయి సేవిస్తూ.. ఆ మత్తులో దారిన వెళ్లే వారిపై రాళ్ల దాడులు చేస్తున్నారు. బాలికలు, విద్యార్థినులు, మహిళలను వేధిస్తున్నారు. దీంతో సాయంత్రం వేళల్లో బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. బిడ్డలను పాఠశాలలు, కళాశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వారే నేరుగా వెళ్లి, వదిలి రావాల్సి వస్తోంది. నందలపాడు, టైలర్స్‌కాలనీ, భగత్‌సింగ్ నగర్, కూరగాయల మార్కెట్, నంద్యాల రోడ్డు, పాతకోట, సుంకులమ్మపాలెం, విజయనగర్ కాలనీ, అంబేడ్కర్‌నగర్, ఏటిగడ్డపాలెం, ఆటోనగర్, టీచర్స్ కాలనీ, యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డు తదితర చోట్ల గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. అయినా పోలీసులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయిని అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



తాడిపత్రి పట్టణ పోలీసు స్టేషన్

బయటకు వెళ్లాలంటే భయం..

పట్టణంలో ఇటీవలిగా విద్యార్థినులు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని వీధుల్లో రాత్రిపూట గంజాయి బ్యాచ్‌లు ద్విచక్రవాహనాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. కొన్ని నెలల క్రితం కృష్ణాపురం 6వ రోడ్డులో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేయడంపై ఒక వ్యక్తి.. పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో అతడి ఇంటిపైకి వెళ్లి గంజాయి బ్యాచ్ దాడి చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒకటికాదు.. రెండు కాదు.. చెప్పుకుంటూ పోతే చాలాచోట్ల దాడులకు తెగబడుతున్నారు. వారిని దండిస్తే ఎక్కడ తమ మీదకు వస్తారోనని భయపడి అందరూ తమ దారిన తాము వెళ్లిపోతున్నారు. గంజాయి బ్యాచ్‌ల అకృత్యాలతో రాత్రివేళల్లో బయటకు వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉందని కొందరు చర్చించుకుంటున్నారు. విద్యార్థినులను కళాశాలలకు పంపించాలంటే కొందరు తల్లిదండ్రులు భయపడుతున్నారు. కళాశాల వద్దకు వెళ్లి పిల్లలను విడిచిపెట్టి వచ్చే పరిస్థితి ఏర్పడింది. కళాశాల ప్రారంభం, విరామం, మధ్యాహ్న భోజనం, వదిలే సమయాల్లో ఈ బ్యాచ్‌లు ఆయా ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో కొందరు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలువురు కళాశాలల నిర్వాహకులు.. పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు పేట్రేగిపోతున్నాయి. ఇలా అయితే ఎలా అంటూ కొందరు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యల్లనూరు రోడ్డు, కృష్ణాపురం జీరో రోడ్డు, పుట్లూరు రోడ్డు ప్రాంతాల్లో కళాశాలలు ఎక్కువగా ఉండడంతో ఆయా చోట్ల నిత్యం గంజాయి బ్యాచ్‌లు తిరుగుతున్నాయి. గంజాయి తోపాటు తెల్లగా పౌడర్ రూపంలో ఉన్న మత్తుపదార్థాన్ని సైతం యువకులు పీల్చుతున్నారు. ఇప్పటికైనా వారి ఆగడాలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

బెంబేలెత్తిస్తున్న బైక్ స్టంట్లు

పట్టణంలోని యల్లనూరు, సీబీ రోడ్డు, పుట్లూరు రోడ్డు, నంద్యాల రోడ్డు ప్రాంతాల్లో యువకులు బైక్ స్టంట్లు వేస్తూ ప్రజలను భయభ్రాంతులకు లోను చేస్తున్నారు. ఇప్పటికే పలువురు బైక్ స్టంట్లు చేస్తూ కిందపడి గాయాలపాలయ్యారు. ఎవరైనా పోలీసులకు సమాచారమిస్తే.. వారు వచ్చే సమయానికి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. మరలా గంట తర్వాత వచ్చేసి యధేచ్ఛగా స్టంట్లు కొనసాగిస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో వారి ఆగడాలకు హద్దేలేకుండా పోతోంది.

ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం



గంజాయి విక్రయాల విషయం మా దృష్టికి వచ్చింది. వాటిపై ఇప్పటికే ప్రత్యేక నిఘా పెట్టాం. ఒక బృందాన్ని కూడా ఏర్పాటు చేశాం. ఎక్కడెక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి, ఎక్కడి నుంచి తెప్పిస్తున్నారనే వాటిపై దృష్టి పెట్టాం. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం.

- రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీ

వక్ఫ్ బిల్లుపై వైసీపీ ద్వంద్వ వైఖరి వీడాలి

టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్‌మొద్దీన్



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుపై వైసీపీ నాయకులు ద్వంద్వ వైఖరిని వీడాలని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ డిమాండ్ చేశారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో వైసీపీ మత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో ఒకలా, రాజ్యసభలో మరోలా వైసీపీ ఎంపీలు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. వైఎస్సార్ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల వక్ఫ్ భూములను అన్యాక్రాంతం అయ్యాయని ఆరోపించారు. దేశంలో ముస్లిం మైనార్టీలకు న్యాయం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. సీఎం చంద్ర బాబు, మంత్రి నారాలోకేశ్‌తోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సమావేశంలో బాబాఫక్రుద్దీన్, మహ్మద్‌రఫీ, మౌలా, జాఫర్, షెక్షావలి, మహబూబ్ బాషా, హాజీవలి, మాబు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళన..!

- వైసీపీ సేవకులపై వేటుకు సిద్ధం
- వారంలోగా కొత్తవారి నియామకం
- దరఖాస్తులు ఆహ్వానించిన ఎస్పీ రత్న



హిందూపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణ, నిఘాలో కీలకమైన స్పెషల్ బ్రాంచ్‌ని ప్రక్షాళన చేసేందుకు ఎస్పీ రత్న శ్రీకారం చుట్టారు. కొన్నేళ్ల నుంచి పాతుకుపోయిన, వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల కొమ్ముకాసి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురికి స్థాన చలనం తప్పేలా లేదు. అవసరాల దృష్ట్యా పలువురిని ఎంపిక చేసి ఎస్‌బీలోకి తీసుకుంటున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఒకేసారి మార్పే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో లా అండ్ ఆర్డర్‌లో ఉన్న కొంతమంది హెడ్ కానిస్టేబుళ్లను ఎస్‌బీకి ఎంపిక చేశారు. ఉత్సాహంగా ఉన్నవారు ఎస్‌బీకోసం దరఖాస్తు చేసుకోవాలని కూడా పదిరోజుల క్రితం ఎస్పీ సూచించారు.

వైసీపీ కార్యకర్తల్లా..

వైసీపీ పాలనలో స్పెషల్ బ్రాంచ్ అసలు విధులను పక్కన పెట్టింది. అప్పటి ప్రతిపక్ష నాయకుల కదలికలపై దృష్టి పెట్టేందుకు, వారి ఆర్థిక వనరులను దెబ్బతీసేందుకు పని చేసిందన్న విమర్శలు మూటగట్టుకుంది. ఇలాంటి సమాచారాన్నే మండలాల్లో పనిచేసే స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది జిల్లా అధికారులకు చేరవేసేవారు. టీడీపీ నాయకులను ఎలా కేసుల్లో ఇరికించాలి, ఎలా ఇబ్బంది పెట్టాలనే సమాచారాన్నే అప్పటి ఎస్పీ స్థాయి అధికారులు సేకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో పెద్ద పెద్ద సంఘటనలు జరిగినా పోలీసులకు ముందస్తు సమాచారం ఉండేది కాదు. ఉదయం లేచినప్పటి నుంచి వైసీపీ సేవలో మునిగడమే తప్ప.. నేర నియంత్రణ, నిఘా అంశాల గురించి పట్టించుకోలేదు. వారే ఇప్పటికీ ఎస్‌బీలో ఉన్నారు. కనీసం పక్క సబ్ డివిజన్లకు కూడా పంపలేదు. పాస్‌పోర్ట్ పరిశీలనలో కొంత మంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరినీ తప్పిస్తున్నారని తెలిసింది.

ఇవీ విధులు..

స్పెషల్ బ్రాంచ్ విధుల్లో ముఖ్యమైనది నిఘా. రేపటి కార్యక్రమాల వివరాలను ఈ రోజే ఉన్నతాధికారులకు నివేదించాలి. రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, నేరస్థులపై నిఘా వేసి.. పరిణామాలను తెలియజేయాలి. పాస్‌పోర్ట్ పరిశీలన, పోలీస్ స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పని తీరు గురించి ఎస్పీకి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. వైసీపీ హయాంలో ఈ వ్యవస్థ గాడి తప్పింది. దీంతో అధికారం మారిన తరువాత స్పెషల్‌బ్రాంచ్‌పై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని లా అండర్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు పంపుతున్నారని తెలిసింది. ఈ క్రమంలో ఏళ్లతరబడి పనిచేస్తున్నవారు స్వచ్ఛందంగా బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వచ్చేవారం జిల్లా వ్యాప్తంగా ప్రక్షాళన పూర్తి అవుతుందని విశ్వసనీయంగా తెలిసింది.

మొక్కల పెంపకంతోనే

ఎడారి నివారణ

జోధ్‌పూర్‌లో పర్యటిస్తున్న అధికారులు, రైతులు



జోధ్‌పూర్‌లో ఇసుకమేటలను పరిశీలిస్తున్న ఉపాధిహామీ అధికారులు

కణేకల్లు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే మండలంలో ఇసుక మేటల నివారణ సాధ్యమవుతుందని ఉపాధిహామీ పథకం ఏపీడీ సుధాకర్, నాగేపల్లి రైతు వాలి వెంకటేశులు పేర్కొన్నారు. ఇసుకమేటల నివారణ కోసం రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాన్ని తెలుసుకునేందుకు ఇక్కడి రైతులు, అధికారులను రాష్ట్ర ప్రభుత్వం అక్కడికి పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులను పరిశీలించిన రైతులు, అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మండలంలోని నాగేపల్లి, తుంబిగనూరు, గనిగిపేటు, మీంజ్రపల్లి, బిదురకుంట తో పాటు బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు, కళ్లదేవనహళ్లిలో ఇసుకమేటలు విస్తరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇసుక మేటలలో గోరుమ, సల్లగింజల మొక్కలతో పాటు ఆర్గానిక్ మొక్కలను పెంచడం వల్ల ఇసుక ఒక చోట నుండి మరో చోటికి రవాణా కాకుండా పెంచుకుండా ఉన్నట్లు అక్కడి అధికారులు తమకు వివరించినట్లు వారు తెలిపారు. మూడురోజులుగా తాము జోధ్‌పూర్‌లోని దేశు మండలం, భగవాన్‌పూర తదితర ఏరియాలలో పర్యటిస్తూ అక్కడి రైతులు తీసుకుంటున్న చర్యలను గమనించినట్లు తెలిపారు. తమతో పాటు జిల్లా ఉపాధిహామీ పీడీ సలీంబాష, టెక్నికల్ టీం జలందర్, గౌరీశంకర్, రాజేష్ తదితరుల బృందం రెండురోజులుగా జోధ్‌పూర్‌లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.



దాహం తీర్చుకుంటున్న నగరవాసులు

సంచార చలివేంద్రం

వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం పరిపాటే. రద్దీ ప్రాంతాల్లో చలువ పందిళ్ల కింద ఇసుక పోసి.. మట్టి కుండల్లో మంచినీటిని అందుబాటులో ఉంచుతారు. పనుల మీద బయటకు వచ్చినవారు అక్కడ దాహం తీర్చుకుంటారు. కానీ అనంతపురం నగరానికి చెందిన ఆటో డ్రైవర్ ఇమామ్.. సంచార చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తన ఆటోలో చన్నీటి క్యాన్‌ను అందుబాటులో ఉంచారు. ఆ విషయం అందరికీ తెలిసేలా బోర్డు ఏర్పాటు చేశారు. "ఏడాది క్రితం వేసవిలో నా ఆటోలో నీటి క్యాన్‌ను ఏర్పాటు చేశాను. దాహం వేసినవారు 'ఆగాన్నా..' అని అడుగుతున్నారు. ఆ సందేహం ఎవరికీ రాకూడదనే బోర్డు రాయించాను.." అని ఇమామ్ తెలిపారు. తన ఆటోలో ప్రయాణించేవారు, స్టాండ్‌లో ఆపినప్పుడు దారిన వెళ్లేవారు దాహం తీర్చుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



ఆటోలో చల్లని నీటిని అందజేస్తున్న ఇమామ్

జగన్ చీటీ చినిగింది

- ఉనికి కోసమే ఆయన పాట్లు
- తాగు, సాగునీరు అందిస్తాం
- అన్ని చెరువులను నీటితో నింపుతాం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న మంత్రి

సోమందేపల్లి/పరిగి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ చీటీ చించివేశారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఎద్దేవా చేశారు. మండలకేంద్రానికి సమీపంలోని హంద్రీనీవా కాలువను శనివారం ఆమె పరిశీలించారు. హంద్రీనీవా అధికారులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా తాగు, సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాలకు తాగు, సాగునీటి కష్టాలను తీర్చడానికి హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలను తరలిస్తున్నామన్నారు. 265చెరువులకు నీరు నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం కాలువ మరమ్మతుల కోసం ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ1.2 కోట్లను కాలువ మరమ్మతు లకు విడుదల చేశారన్నారు. సోమందేపల్లి మండలంలో 17చెరువులు పూర్తిగా నింపామన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, నీరుగంటి చంద్ర, సిద్దలింగప్ప, సీనీ హరి పాల్గొన్నారు.

ఉనికి కోసమే..

రాష్ట్రంలో జగన్ ఉనికి కోసమే పరామర్శలకు వస్తున్నాడని మంత్రి సవిత అన్నారు. వైసీపీ పాలనలో జరిగిన రాజకీయ హత్యలు, బాధితులకు న్యాయం చేసి పరామర్శించాలన్నారు. మాజీమంత్రి పరిటాల రవీంద్ర ఎలా చనిపోయారో చర్చకు రావాలన్నారు. వైఎస్ వివేకాను ఎవరు చంపారో చెప్పి చెల్లెలు సునీతను పరామర్శించాలన్నారు. తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలను పరామర్శించని జగన్ ముందుకు రావాలన్నారు. కారు డ్రైవర్‌ను చంపి డోర్‌డెలివరి చేసింది మీ పాలనలో కాదా అని ప్రశ్నించారు. డాక్టర్ సుధాకర్ మరణానికి కారణం ఎవరని మండిపడ్డారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్ రానుండటం కేవలం ఆ పార్టీ ఉనికిని చాటుకోవడానికేనని విమర్శించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

పరిగి మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి సవిత భూమి పూజ చేసి ప్రారంభించారు. పైడేటి నుంచి నర్సాపురానికి తారు రోడ్డు నిర్మాణానికి రూ.కోటి కేటాయించారు. విట్లాపల్లి నుంచి తిరుమలదేవరపల్లికి, ఊటుకూరు నుంచి ఒక్కంపల్లి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ నిర్మాణానికి రూ.9లక్షలు, 44గోకులం షెడ్లు, బీసీ హాస్టల్ మరమ్మతులకు రూ.45లక్షలు, హాస్టల్ నిర్మాణానికి రూ.కోటి మంజూరైనట్లు తెలిపారు. రూ.కోటితో పైడేటి నూతన సబ్‌స్టేషన్‌ను నెలరోజుల్లో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, తహసీల్దార్ హసీనాసుల్తానా, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మారుతిప్రసాద్, సర్పంచ్ బాలాజీ, కాంట్రాక్టర్ మహేశ్వర్ రావు, తిలక్, వడ్డె హనుమయ్య పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్

హత్యా రాజకీయాలను ప్రోత్సహించడానికే పర్యటన

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే బీసీల ద్రోహి మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప మండిపడ్డారు. హిందూపురంలోని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ప్యాలెస్‌లను ఆలించేవారని అన్నారు. ఫ్యాక్షన్‌తో రక్తపాతం గ్రామాల్లో హింద్రీనీవా నీరిచ్చి పచ్చని పొలాలుగా మార్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డాక్టర్ సుధాకర్‌ను హింసించి చంపేశారని తెలిపారు. బీసీ నాయకుడు చంద్రయ్యను హత్యచేస్తే ఆయన కుటుంబానికి సంతాపం తెలిపావా. ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎంతోమంది మీ పార్టీ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకుల చంపితే ఏ ఒక్కరినైనా పరామర్శించిన పాపానపోలేదన్నారు. ఇద్దరి మధ్య గొడవతో రామగిరి మండలంలో ఒక వ్యక్తి చనిపోతే రాజకీయ లబ్ధి కోసం ఆయన్ను పరామర్శించడానికి ఏ మొహం పెట్టుకుని వస్తున్నావని ప్రశ్నించారు. ఐదేళ్ల కాలంలో తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి చేసిన దందాలు, సెటిల్‌మెంట్లు, బీసీలను అణగదొక్కడం కనిపించలేదా అన్నారు. మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ మాట్లాడుతూ.. తల్లికి, చెల్లికి న్యాయం చేసిన తరువాత లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించాలన్నారు. సమావేశం నాయకులు రాము, రామాంజనేయులు, అమర్‌నాథ్, రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో పాము కాటు వేయడంతో రొద్దం మండలం కంబాలపల్లికి చెందిన రైతు సిద్దప్ప(48) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కంబాలపల్లి గ్రామానికి చెందిన సిద్దప్ప తన రెండెకరాల పొలంలో మల్బరీ సాగుచేస్తుండేవాడు. శనివారం ఉదయం సిద్దప్ప కాడెద్దులను తోలుకుని వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలం పనులు చేస్తుండగా ఉదయం 10గంటల సమయంలో పాము కాటేసింది. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని స్థానికులు గుర్తించి పెను కొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సువర్ణమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కానిస్టేబుల్ షెక్షావలి తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని సిద్దప్ప మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



భాగ్యరాజ్ (ఫైల్)

లేపాక్షి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కొడికొండ-శిర జాతీయరహదారి చోళసముద్రం టోల్‌గేట్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన భాగ్యరాజ్(26) లేపాక్షి నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. లేపాక్షి మండలం గలిబిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, మరో వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై హిందూపురం నుంచి వస్తున్నాడు. టోల్‌గేట్‌వద్ద ఎదురెదురుగా వచ్చిన ద్విచక్రవాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భాగ్యరాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. నాగరాజు, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లేపాక్షి ఏఎస్ఐ వెంకటేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేస్తూ కార్మికుడి మృతి

రాయదుర్గం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటిగుట్టలో భవన నిర్మాణ పని చేస్తూ మారెన్న(60) అనే కార్మికుడు కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. ముత్తానికాలనీలో నివాసముండే మారెన్న శనివారం ఉదయం భవన నిర్మాణ పనికి కోటిగుట్టకు వెళ్లాడు. అక్కడ సిమెంట్, ఇసుక కలుపుతూ మధ్యాహ్నం ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. తోటి కార్మికులు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటు లేక వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

భవనం పైనుంచి పడి వృద్ధురాలి మృతి

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని చిత్రావతి రోడ్డులో గల రంగసాయి అపార్టుమెంటులో నివాసముంటున్న హేమలత (80) అనే వృద్ధురాలు శనివారం ఉదయం ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి మృతిచెందారు. వ్యాయామం చేయడానికి ఆరో అంతస్తులోకి వెళ్లి, అక్కడి నుంచి కాలుజారి కింద ఉన్నషాపు కండీలపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కృష్ణ జిల్లాకు చెందిన మృతురాలు 15 సంవత్సరాలు క్రితం పుట్టపర్తికి వచ్చి సత్యసాయిబాబా సేవకురాలుగా పనిచేస్తుండేది. మృతురాలి చెల్లెలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ సునీత తెలిపారు.

చీనీ టన్ను రూ. 26వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8వేలు, సరాసరి రూ. 16,500తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1070 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పరిటాల, చమన్ కుటుంబాలది విడదీయరాని బంధం

- శ్రీరామ్, ఉమర్ మధ్య అదే స్నేహబంధం
- చమన్ మృతిపై ఆరోపణలను ఖండిస్తున్నా
- తోపుదుర్తిని హెచ్చరించిన చమన్‌సాబ్ సతీమణి రమీజా



మాట్లాడుతున్న రమీజా

అనంతపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పరిటాల, చమన్ కుటుంబాలది విడదీయరాని బంధమని జడ్పీ మాజీ చైర్మన్ దివంగత చమన్‌సాబ్ సతీమణి, రామగిరి మాజీ ఎంపీపీ రమీజా అన్నారు. పరిటాల రవీంద్ర, చమన్ ఏ విధంగా స్నేహబంధంతో మెలిగారో... పరిటాల శ్రీరామ్, తన కుమారుడు ఉమర్‌ముక్తార్ అదే స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కొన్ని రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో... మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చమన్‌ను పరిటాల కుటుంబం హత్య చేసిందని చేసిన వ్యాఖ్యలపై చమన్ సతీమణి రమీజా స్పందించారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ... ఆమె శనివారం మీడియాకు వీడియో విడుదల చేశారు. పరిటాల కుటుంబమే చమన్‌ను హత్య చేసిందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రస్తావించడాన్ని పూర్తిగా ఖండిస్తున్నా అన్నారు. ఈ తరహా వ్యాఖ్యలు గతం నుంచి తనతో పాటు తన కుమారుడు ఉమర్ ముక్తార్ పలు సందర్భాల్లో ఖండించామని గుర్తుచేశారు. పరిటాల, చమన్ కుటుంబాలది ఈనాటి బంధం కాదన్నారు. పరిటాల రవీంద్ర, చమన్ స్నేహితులు కన్నా... అన్నదమ్ములుగా మెలిగారని అన్నారు. అదే బాటలో శ్రీరామ్, ఉమర్‌ముక్తార్ నడుస్తున్నారన్నారు. తమ రెండు కుటుంబాల మధ్య ఇలాంటి మాటలు మాట్లాడొద్దని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని ఆమె హెచ్చరించారు. తమ కుటుంబాలను వేరుచేయడం ఎవరి వల్ల కాదన్నారు. ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆమె తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి హితవు పలికారు.

స్వామి వారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



ఖాద్రీశుడి ఆలయం భక్తులతో కిటకిట

కదిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శని, ఆదివారాలు సెలవు కావడంతో భక్తులు మరింత అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

పసుపు పుచ్చకాయ

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పుచ్చకాయ లోపలి భాగం ఎర్ర రంగులో ఉండటం సర్వ సాధారణం. కాని హిందూపురంలో మాత్రం పసుపుపచ్చ రంగులో ఉన్న పుచ్చకాయలను వ్యాపారులు విక్రయిస్తున్నారు. హైవేలో రంగులో ఉన్న పుచ్చకాయలను జనం ఆసక్తిగా చూసి కొంటున్నారు. రుచి సాధారణంగానే ఉన్నా.. రంగు వేరే ఉండటంతో కొందరు అనుమానిస్తున్నా.. రుచి చూస్తున్నారు. వీటిని విక్రయించే వ్యాపారికి సైతం వాటి రంగు వేరే అనే విషయం కొసదిరా తెలియదు. వీటిని ఎక్కడి నుంచి కొని తెచ్చిందీ తనకు తెలియదని విక్రేత అన్నారు.





న్యూస్ బాక్స్

కొనసాగిన వసంత నవరాత్రి ఉత్సవాలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు శనివారం దేవీ ఖడ్గమాల స్తోత్ర పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అనంతేశ్వరి సమేత అనంతేశ్వరస్వామి మూల విరాట్లకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో సామూహికంగా మణిద్వీప వర్ణన, దేవీ ఖడ్గమాల స్తోత్ర పారాయణం చేశారు. తీర్థప్రసాద, అన్నదాన వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉద్యాన సదస్సుకు తరలిరండి : సీపీఐ

గార్లదిన్నె, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 8న జరగనున్న ఉద్యాన రైతు రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు శ్రీనాథ్ చౌదరి పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్లను శనివారం సీపీఐ నాయకులు మండల కేంద్రంలో విడుదల చేశారు. సదుస్సుకు రైతులందరు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

శ్రీరామనవమి పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమిని పురస్కరించుకుని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో తపోవనంలోని శివశక్తి సాయి దేవాలయంలో ఆదివారం నిర్వహించనున్న వేడుకలకు సంబంధించిన పోస్టర్లను శనివారం డీఆర్‌ఓ మలోల ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సెల్‌పోన్లు వాడితే...క్రమశిక్షణా చర్యలు'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం విద్య, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పదో తరగి పరీక్షల మూల్యాంకనంలో ఎవరూ సెల్‌ఫోన్లు వాడకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే...క్రమశిక్షణా చర్యలు తీసుకుంటా మని శనివారం డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ పేర్కొన్నారు. ఈ నెల 4న ఆంధ్రజ్యోతిలో 'సెల్ స్పాట్' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై కమిషనరేట్, కలెక్టరేట్ అధికారులు హెచ్చరించడంతో...డీఈఓ, ఏసీ అప్రతమత్తమయ్యారు. ఏసీఓలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి గట్టిగా ఆదేశాలిచ్చారు. అయితే తొలి రోజు పేపర్లు దిద్దుతూ నిర్లక్ష్యంగా సెల్‌ఫోన్లు వాడుతూ పేపర్లు దిద్దిన పలువురు ఎగ్జామినర్లకు మెమోలు జారీ చేసినట్లు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది.

విజ్ఞాన వికాసానికి వేదిక సింపోజియం : ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కొత్త ఆలోచనలకు నాంది, విజ్ఞాన వికాసానికి సింపోజియం సదస్సులు వేదికలాంటివని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన జాతీయ స్థాయి స్టూడెంట్ టెక్నికల్ సింపోజియం సదస్సును శుక్రవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య ప్రారంభించగా శనివారం ముగింపు వేడుకలకు ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం నిర్వహించిన క్విజ్, సెమినార్, పోస్టర్ ప్రెజంటేషన్, ట్రెజర్ హంట్‌లలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సర్టిఫికెట్లను బహూకరించి అభినందించారు. విభాగాధిపతి మారాల రామశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో సీనియర్ ప్రొఫెసర్ విజయకుమార్, కిరణ్మయి, విశాలి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యామూర్తి బృందానికి స్వర్ణకలశాలు



స్వర్ణ కలశాలు అందుకుంటున్న సంధ్యామూర్తి బృందం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన నాట్యాచార్యురాలు సంధ్యా మూర్తి బృందం స్వర్ణ కలశాలను అందుకుంది. మహతి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 14 మంది సంగీత, నాట్య గురువులను ఉగాది పురస్కారాలకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా జిల్లా తరఫున శ్రీనృత్యకళా నిలయం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తిని ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో శనివారం నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవ సభలో సంధ్యామూర్తి శిష్యబృందం హిమశ్రీ, హర్షవర్ధ, హాసిని, దీక్షిత, వైష్ణవిలు భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలిచ్చారు. అనంతరం తెలుగు యూనివర్సిటీ వీసీ చలపతి చేతులమీదుగా తమ బృందానికి స్వర్ణకలశాలు, తనకు ఉగాది పురస్కారం అందజేసి సత్కరించినట్లు సంధ్యామూర్తి తెలిపారు.

'మన డివిజన్ - మన బాధ్యత' ప్రచార రథం ప్రారంభం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచనల మేరకు టీడీపీ మైనార్టీ నాయకుడు దాదు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన డివిజన్ - మన బాధ్యత పేరుతో చెత్త పరిశ్రభతపై అవగాహన కల్పించే ప్రచార రథాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక 42వ డివిజన్‌లో ప్రచార రథాన్ని ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తలారి ఆదినారాయణ, రాయల్ మురళి, కూచి హరి, బాబాఫక్రుద్దీన్, ఫిరోజ్ అహ్మద్, సైఫుద్దీన్, పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, నెట్టెం బాలకృష్ణ, గోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

● సర్పంచ్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

రాప్తాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని బస్టాండు సమీపంలో పాత గ్రామ సచివాలయం వద్ద 70 సంవత్సరాలు పైబడిన గుర్తు తెలియని వృద్ధుడు శనివారం మృతి చెందాడు. స్థానికులు గుర్తించి రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతుడి సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. సర్పంచ్ తిరుపాలు అధ్వర్యంలో పంచాయితీ పారిశుధ్య కార్మికులు స్థానిక శ్మశాన వాటికలో వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. నగరంలోని ఆర్వీనాయుడు కాలనీకి చెందిన దాదా వలి (27) వెల్డింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 2న బైక్‌లో ఆయిల్ మార్చుకోవడానికి గుత్తి రోడ్డుకు బయ లుదేరాడు. బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీ కొనడంతో తీవ్రగా యాలయ్యాయి. అతడిని ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య అర్షియా ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పాతూరులో కాషాయ జెండాలు విక్రయిస్తున్న దృశ్యం



ప్రసాద వితరణ కోసం లడ్డూలను సిద్ధం చేస్తున్న శ్రీనివాస నగర్ ఆలయ కార్యవర్గం

రాములోరి పండుగకు సిద్ధం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : హిందువుల ప్రధాన పండుగల్లో ఒకటైన శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని రామమందిరాలన్నీ భక్తజనకోటితో కిటకిటలాడనున్నాయి. ఇప్పటికే రామాలయాలు విద్యుద్దీపాలంకరణతో ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆయా ఆలయాలవద్ద అవసరం మేరకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. అలాగే ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి వందలాదిమంది రాములవారి నగరోత్సవంతో పాటు మెగా బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు. అలాగే మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఆదివారం నుంచి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. ఇక ఆజాద్‌నగర్‌లోని దత్త మందిరం, విద్యుత్‌నగర్ కాలనీలోని పంచముఖాంజనేయస్వామి దేవాలయం, లక్ష్మీనగర్ రామాలయం, శ్రీనివాసనగర్ రామాంజనేయ ఆలయం, వేణుగోపాల్ నగర్ సద్గురు సాయినాథ మందిరం, విద్యారణ్యనగర్, మారుతీ నగర్ రామాలయాలు పాతూరు రామస్వామి గుడి, రెవెన్యూ కాలనీ, అంబేడ్కర్ నగర్, బుడ్డప్పనగర్ రామాలయాలు, పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు అన్ని ప్రాంతాల్లోని రామాలయాల్లో ప్రత్యేక విశేష పూజలు, కల్యాణోత్సవాలు, ఉట్లమానుపరుషలు నిర్వహించనున్నారు.

● చెన్నేకొత్తపల్లి: శ్రీరామనవమిపండుగను పురస్కరించుకుని మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం ఉదయం అభిషేకాలు, కల్యాణోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా చెన్నేకొత్తపల్లిలో ఉదయం 10గంటలకు రాములోరి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆయా ఆలయ నిర్వాహకులు తెలిపారు.



చెన్నేకొత్తపల్లిలోని సీతారామలక్ష్మణులు

మార్కెట్ యార్డుల అభివృద్ధికి కృషి చేస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన చైర్మన్లు



ఎమ్మెల్యేతో భేటీ అయిన చైర్మన్ సుధాకర్ చౌదరి, టీడీపీ నాయకులు

రాప్తాడు/రామగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తూ మార్కెట్ యార్డుల అభివృద్ధి కోసం కృషి చేస్తామని రాప్తాడు, ధర్మవరం మార్కెట్ యార్డు చైర్మన్లు బోయపాటి సుధాకర్ చౌదరి, అరుణశ్రీ తెలిపారు. వారు శనివారం ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం శుక్రవారం మార్కెట్ యార్డు చైర్మన్‌లను నియమించింది. రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ వేపకుంట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బోయపాటి సుధాకర్ చౌదరి శనివారం వెంకటాపురానికి వెళ్లి పరిటాల రవీంద్ర ఘాట్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురంలో టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను కలిశారు. ఆయన వెంట కనగానపల్లి మండల నాయకులు ముకుంద నాయుడు, అంజి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు. ధర్మవరం మార్కెట్ యార్డు చైర్మన్ అరుణశ్రీ, వైస్ చైర్మన్ ములుగూరు అయ్యప్ప అనంతపురానికి వచ్చి ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ధన్యవాదాలు తెలిపారు.



● అనంతపురం రూరల్: రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైనా సుధాకర్‌ను రూరల్ మండల నాయకులు కలిశారు. నగరంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో ఆయనను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

అనంతపురం విద్య, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీఎస్‌ఓ రెండో లెవల్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థలకు చెందిన అనంతపురం జోన్‌లోని పలువురు విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్‌లు సాధించినట్లు ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఏడుగురు లాప్‌టాప్‌లు సాధించారన్నారు. ఆయన శనివారం స్థానిక కమ్మభవన్ వద్ద ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌లో ఆ విద్యార్థులను అభినందించారు. ఐఎన్‌టీఎస్‌ఓ రెండో లెవల్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచా రన్నారు. అనంతపురం జోన్‌కు చెందిన విద్యార్థులు 28 మంది మొదటి ప్రైజ్‌లు, 43 మంది రెండో, మూడో ప్రైజ్‌లు , 39 మంది నాలుగో ప్రైజ్‌లు, 53 మంది ఐదో ప్రైజ్‌లు సాధించారన్నారు. 955 మంది కన్సోలేషన్, 382 మంది గోల్డ్‌మెడల్స్ సాధించారన్నారు. 3,640 మంది విద్యార్థులు సత్తా చాటారన్నారు. రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, సమీనా ఖాన్, తబస్సుమ్, వెంకటేష్, రాధిక, పర్వీన్, నేత్రావతి, శాంత, నారాయణస్వామి, నరేష్, మురళి పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ఎంపీ కుటుంబ సభ్యులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు ఎంపీ కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదం అందజేశారు.



ఎంపీ కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారి

రాష్ట్రంలో మత రాజకీయాలకు వైసీపీ కుట్ర

● ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మతరాజకీయాలు చేసేందుకు వైసీపీ కుట్ర పన్నుతోందని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ మైనార్టీ విభాగం నగర మాజీ అధ్యక్షుడు మహబూబ్‌బాషా పేర్కొన్నారు. ఆయన శనివారం ఐఎంఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లు అంశంలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి డబుల్‌గేమ్ ఆడుతూ ప్రజలను మభ్యపెడుతున్నాడని విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు ఎన్‌ఆర్‌సీ, ఆర్టికల్ 370, త్రిబుల్ తలాక్, అలాగే మణిపూర్ ఘటనల విషయంలో బీజేపీ తో వైసీపీ పొత్తు నిజం కాదా..? అని ప్రశ్నించారు. వైఎస్ఆర్ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో లక్షల ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. దేశ చరిత్రలో నేటికీ ముస్లింలకు మేలు చేకూర్చే కార్యక్రమాలు చేపడుతున్నది ఒక్క టీడీపీనే అన్నారు. ఇకనైనా జగన్మోహన్‌రెడ్డి ద్వంద్వ వైఖరిని వీడాలన్నారు.

భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● మంత్రి పయ్యావులకు సీపీఎం నాయకుల వినతి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం రూరల్ మండల పరిధిలో ఇటుకులపల్లికి చెందిన సర్వే నెంబర్లు 248/1ఏ1, 248/1ఏ2లలో దాదాపు 9.47 ఎకరాల కబ్జాకు పాల్పడినవారిప కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ పారదర్శకంగా విచారణ జరుపుతామని, వీలైనంత త్వరగా నివేదిక తెప్పించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

● రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రజలు చెప్పిన సమస్యలను సావధానంగా విని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆదర్శ పాలనకు దిక్సూచి జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



జయంతి వేడుకల్లో కొనియాడిన వక్తలు

జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గేయానంద్ తదితరులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

సమసమాజ నిర్మాణంకోసం ప్రజలకు ఆదర్శ వంతమైన పాలన అందించడంలో నేటి పాలకులకు మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్ రామ్ దిక్సూచిలాంటివారని పలువరు నాయకులు కొనియాడారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సప్తగిరి సర్కిల్ కేఎస్ఆర్ కళాశాల ఎదురుగా నిర్వహించిన వేడుకల్లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించేందుకు వివిధ పార్టీలు, కుల సంఘాలు, రిజర్వేషన్ ఉద్యోగ సంఘాల నాయకులతోపాటు ప్రజలు బారులు తీరారు. ఈ సందర్భంగా జగ్జీవన్ ఆశయాలపై దళిత సంఘాల నాయకులు సాకేహరి పాడినపాట ఆలో చింపజేసింది. అలాగే ఆయా కారాలయాల్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళుర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. జేవీవీ జిల్లా కార్యాలయంలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ జగజ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జేవీవీ రాష్ట్ర నాయకుడు సాకే భాస్కర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, డాక్టర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ అర్బన్ కార్యాలయంలో జగజ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. నాయకులు గంగారామ్, తలారి ఆదినారాయణ, రాయల్ మురళి, స్వామిదాస్, కూచి హరి, సుధాకర్ యాదవ్, బాలాంజినేయులు, కుంచెపు వెంకటేష్, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న, పరమేశ్వరన్, సిమెంట్ పోలన్న, లక్ష్మీనరసింహ, గోపాల్ గౌడ్, ఇస్మాయిల్, ఓంకార్‌రెడ్డి, వెంకటప్ప, కృష్ణకుమార్, నెట్టెం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరమేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య తదితరులు పాల్గొన్నారు. ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ తదితరులు స్థానిక సప్తగిరి సర్కిల్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సంఘం కేంద్రకమిటీ సభ్యులు సోమశేఖర్, నాయకులు సుగప్ప, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధి విలువలకు డాక్టర్ జగ్జీవన్‌రామ్ నిలువుటద్దమని జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. వర్సిటీ పరిపాలనా భవనంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో జగ్జీవన్ చిత్రటపానికి వీసీ సుదర్శనరావు నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఓఎస్డీటు వీసీ దేవన్న, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నారాయణస్వామి, ఏఓ గిరిజామనోహర్, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు. మండలకేంద్రమైన నార్పలలోని దండోరా కార్యాలయంలో, రామగిరి తహసీల్దార్ కార్యాలయంలో, నసనకోట బాలికల గురుకుల పాఠశాలలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



నివాళులర్పించేందుకు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బారులు తీరిన దృశ్యం

కాశీ పాదయాత్రికులకు అన్నదానం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రామేశ్వరం నుంచి కాశీకి పాదయాత్ర చేస్తున్న భక్తులకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నదానం, వసతి ఏర్పాట్లు చేశారు. తమిళనాడు, కేరళకు చెందిన 50 మంది భక్తులు శనివారం కాశీ పాదయాత్రలో భాగంగా అనంతపురానికి చేరుకున్నారు. జిల్లాలో 10 రోజుల పాటు సాగే పాదయాత్ర సందర్భంగా వారికి భోజనం, వసతి ఏర్పాట్లను ఎమ్మెల్యే కల్పిస్తున్నారు. టీడీపీ నాయకులు రామాంజినేయులు, బోయపాటి రామచంద్ర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



యాత్రికులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

మా పాలనలోనే రోడ్లకు మహర్దశ

● ఎమ్మెల్యే పరిటాల సునీత ● ఎంబీపల్లి రోడ్డు ప్రారంభం



ఎంబీపల్లి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక రోడ్లకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని ఆలమూరు పంచాయతీ పరిధిలో ఎంబీపల్లికి నూతనంగా నిర్మించిన రోడ్డును ఆమె శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఐదేళ్ల పాలనలో గుంతల రోడ్లతో ప్రజలు నరకం చూశారన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలోనే ఈ గ్రామానికి రోడ్డు మంజూరు అయిందన్నారు. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పనులు ముందుకుసాగలేదన్నారు. గత వైసీపీ పాలనలో రోడ్డు వేయక పోగా..ఉన్న రోడ్లను ధ్వంసం చేశారన్నారు. పనులు చేయకుండా కాంట్రాక్టర్లను అడ్డుకున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాకే రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. రానున్నరోజుల్లో ఏగ్రామాంలోనూ రోడ్డు సమస్య లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాములరాయి రఘు, టీడీపీ నాయకులు ఆలమూరు సూరి, వీరాంజనేయులు, మురళీమోహన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు దెబ్బతిన్న పంటలు

శింగనమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం కురిసిన భారీ గాలివానకు మామిడి, వరి పంటలు దెబ్బతిని, రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని చిన్న జలాలపురం, కల్లుమడి, తరిమెల ప్రాంతాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. వందలాది ఎకరాల్లో వరిపంట నేలకు ఒరిగింది. చిన్న జలాలపురానికి చెందిన రైతులు సుంకర శ్రీనివాసులు, పట్నం నగేష్, ఎన్‌వీ నారాయణ మామిడితోటల్లో కాయలు రాలిపోయి రూ.లక్షలలో నష్టం వచ్చింది. వందలాది ఎకరాల్లో వరిపంట నేలకు ఒరగడంతో రూ. లక్షల్లో నష్టం వచ్చినట్లు సంబంధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ అకాల వర్షాలకు మండల వ్యాప్తంగా వరి, మామిడి, కురగాయల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.



రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు శ్రీనివాసులు

వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోండి

● సీఎంను కలిసి విన్నవించిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అకాలంగా కురిసిన గాలివానకు పెద్ద సంఖ్యలో రైతులు పంటలు నష్టపోయారని, వారిని ఆదుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విన్నవించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ టిడిపి నాయకురాలు బండారు లీలావతి శుక్రవారం రాత్రి రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి నియోజకవర్గంలోని సమస్యలపై విన్నవించారు. గురువారం రాత్రి నియోజకవర్గంలో అకాల వర్షానికి పండ్లతోటలతో పాటు వరి మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. నియోజక వర్గంలోని సమస్యల పరిష్కారానికి నిధులు కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



సీఎంకు విన్నవిస్తున్న ఎమ్మెల్యే

సూపర్‌స్పెషాలిటీలో ఇక నిత్యాన్నదానం



ఆస్పత్రిలో భోజన సదుపాయం ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ తదితరులు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శారదానగర్‌లో ఉన్న ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో రోగులకు ఇక నుంచి ప్రతిరోజు ఉచితంగా భోజనం పెట్టనున్నారు. ఇక్కడ నిబంధనల మేరకు అడ్మిషన్‌లో ఉన్నవారికి మాత్రమే ఆస్పత్రి కాంట్రాక్టర్ భోజనం అందిస్తారు. అయితే వివిధ వ్యాధులతో బాధపడుతూ చికిత్సల కోసం ఓపీలకు సుదూర ప్రాంత వచ్చిన రోగులు, సహాయకులు అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో వైద్యాధికారుల కోరిక మేరకు సూపర్ స్పెషాలిటీలో ప్రతి రోజూ ఉచితంగా భోజనం అందించడానికి శ్రీసాయి లక్ష్మీనరసింహ అన్నదాన ట్రస్టు ముందుకొచ్చింది. ఈ ఉచిత భోజన వసతిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఇక నుంచి ప్రతి రోజూ మధ్యాహ్నం 12-30 గంటల నుంచి 1-30 గంటల వరకు సూపర్ స్పెషాలిటీలో ఉచితంగా భోజనం అందిస్తారని తెలిపారు. రోగులు, వారి సహాయకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ట్రస్టు సభ్యులకు పూర్తిగా సహకరించాలని కోరారు. సూపర్‌స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనిడిట్టా, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టరు హేమలత, ట్రస్టు ప్రతినిధులు నరేంద్రగుప్త, నాగరాజు, జనార్దన్, శ్రీధర్, ఆనంద్, గోపాల్, గీతావాణి తదితరులు పాల్గొన్నారు.

అంతా కలరింగే..!

- సబ్ సెంటర్ రీ మోడలింగ్ పనుల్లో మాయలు
- టెండర్ వేయకుండా ఎత్తుగడ
- ఐదు పనులుగా విభజించి.. నామినేషన్ మాటున వైసీపీ నాయకుడికి ధారాదత్తం
- రంగులేసి.. రూ.10లక్షలు స్వాహా
- బిల్లులు చేసిన పీఆర్ అధికారులు

విడపనకల్లు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు ప్రజాధనాన్ని అడ్డంగా దోచుకున్నారన్నది బహిరంగ రహస్యమే. అందుకు నిదర్శనమే వజ్రకరూరు మండలం వీపీపీ (రూపా నాయక్) తండాలో సబ్ సెంటర్ రీ మోడలింగ్ పనులు. దాదాపు రూ.9.65 లక్షల పనులు చేశారు. రూ.5 లక్షల పైచిలుకు వ్యయమయ్యే పనులకు కచ్చితంగా టెండర్లు పిలవాలి. అలాచేస్తే దోపిడీకి అవకాశం ఉండదని మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త, వైసీపీ నాయకుడు ఎత్తుగడ వేశాడు. అందుకు పంచాయతీరాజ్ అధికారులు కావాల్సినంతా సహకారం అందించారు. అంతే, ఆ పనులను ఐదుగా విడగొట్టారు. ఎంచక్కా.. నామినేషన్ పనులుగా చేపట్టారు. టెండరు అవసరం లేకుండా వైసీపీ నాయకుడికి పనిని అప్పగించారు. దెబ్బతిన్న కిటికీలు, తలుపులు కూడా మార్చకుండా భవనం, ప్రహరీకి రంగులేసి.. అప్పనంగా బిల్లులు దోచుకున్నారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఈ పనుల్లో మాయలు అన్నీ.. ఇన్నీ.. కావు.

అడ్డగోలుగా..

వీపీపీ తండాలోని సబ్ సెంటర్‌ను రీమోడలింగ్ చేయాలని నిర్ణయించారు. రూ.5లక్షలకు పైగా పనులు చేయాలంటే టెండర్లు పిలవాలి. అధికారులు మాత్రం అడ్డదారిని వెతుకున్నారు. రూ.9.65 లక్షలను ఐదుగా విభజించారు. వైసీపీ నాయకుడికి బిల్లులు చేయించారు. నిబంధనల ప్రకారం రూ.2లక్షలోపు పనులు పీఆర్ ఏఈ పర్యవేక్షణలో జరగాలి. రూ.2లక్షలు దాటితే ఈఈ పర్యవేక్షణలో చేపట్టాలి. ఇవేవీ అధికారులు, వైసీపీ నాయకులకు అడ్డు రాలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టారు. ఐదుగా విభజించి, వైసీపీ నాయకుడికి అడ్డగోలుగా లబ్ధి చేకూర్చారు.



వీపీపీ తండాలో రంగులు వేసిన సబ్ సెంటర్

పీహెచ్‌సీ పేరుతో బిల్లులు..

వీపీపీ తండాలో ఆరోగ్య ఉపకేంద్రం మాత్రమే ఉంది. ఆ భవనానికే రీ మోడలింగ్ చేశారు. బిల్లుల చెల్లింపులో అధికారులు గుడ్డిగా వ్యవహరించారు. ఆ బిల్లులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పేరుతో చేశారు. వాస్తవానికి తండాలో పీహెచ్‌సీనే లేదు. పీఆర్ అధికారులు మాత్రం వీపీపీ తాండాలో పీహెచ్‌సీకి అంటూ రూ.2.56 లక్షల బిల్లు చెల్లించారు. దీనిని బట్టి చూస్తే అప్పట్లో అధికార పార్టీకి యంత్రాంగం ఏస్థాయిలో దాసోహమైందో అర్థం చేసుకోవచ్చు. ఇదే విషయమై అధికారులను అడగ్గా.. సబ్ సెంటర్‌ను పీహెచ్‌సీగా చూపించవచ్చంటూ కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.



పాత తలుపులకే రంగులు

అదేం తప్పుకాదు..

ఐదు విడతల్లో సబ్ సెంటర్ రీమోడలింగ్ పనులు చేపట్టిన విషయం వాస్తవమే. సబ్ సెంటర్‌ను పీహెచ్‌సీగా చూపించవచ్చు. అదేమీ తప్పుకాదు.

- మణిభూషణ్, పీఆర్ ఏఈ, వజ్రకరూరు

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన కేశన్నకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.75,440ల ఆర్థిక సాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ జిల్లాకేంద్రంలోని రామ్‌నగర్‌లో గల తన నివాసంలో శనివారం లబ్ధిదారుడికి పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు లింగమూర్తి, నరేష్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.8.55 కోట్లు మంజూరు

ఉరవకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరిన బీటీ రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు నిర్మించడానికి నాబార్డు నిధుల కింద రూ.8.55కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం ప్రకటనలో తెలిపారు. విడపనకల్లు మండలంలో బళ్లారి రోడ్డు నుంచి కొట్టాలపల్లికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.50లక్షలు, విడపనకల్లు నుంచి కొత్తకోట వరకూ రూ.1.30 కోట్లు, బళ్లారి రోడ్డు నుంచి చీకలగుర్కి వరకూ రూ.1.50కోట్లు, అలాగే బెళుగుప్ప మండలంలో కళ్యాణదుర్గం రోడ్డు నుంచి ఆవులన్న వరకూ రూ.55లక్షలు, కాలువపల్లి నుంచి జీడిపల్లి వరకూ రూ.1.50కోట్లు, ఉరవకొండ మండలంలో బళ్లారి రోడ్డు నుంచి రా యంపల్లి వరకూ వెళ్లే రోడ్డుకు రూ.3.20కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ మార్గాల్లో బీటీ రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

గుత్తిరూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని శ్రీపురం గ్రామంలో శనివారం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో 12 జతల దేశవ ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు జయరాం, తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ప్రారంభించారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన మస్తాన్ యాదవ్ వృషభాలు మొదటి బహుమతిగా రూ.30 వేలు గెలుపొందాయి. అలాగే అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం గోవిందవాడకు చెందిన గురుస్వామి వృషభాలు రెండో బహుమతిగా రూ.20 వేలు, అదే మండలం లింగాదహాళ్‌కు చెందిన ఎర్రిస్వామి వృషభాలు మూడో మహుమతిగా రూ.15 వేలు గెలుపొందాయి. సర్పంచు లింగమయ్య, టీడీపీ పట్టణ కన్వీనర్ ఏంకే చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

8న బూదగవిలో ..

ఉరవకొండ: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని బూదగవి గ్రామంలో ఈ నెల 8వ తేదీన రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గదిలింగ, అఖిల్ శనివారం ప్రకటనలో తెలిపారు. విజేత వృషభాలకు మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతిగా రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు వంద రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8008024685, 8179134829కు సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో టీడీపీ సీనియర్ నాయకుడి మృతి



బోయ పెన్నప్ప (ఫైల్)

బెళుగుప్ప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు డ్రైవర్ బోయ పెన్నప్ప (70) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆవిర్భావం నుంచి ఆయన పార్టీలో కొనసాగుతూ చురుగ్గా పని చేశారు. విషయం తెలుసుకున్న నాయకులు వన్నూరుస్వామి, మల్లికార్జున, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కంచి రాముడు, పెద్ద తిప్పయ్య, రుద్రయ్య, అనిల్, బాలాజీ తదితరులు అతడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

రైల్లోంచి పడి మహారాష్ట్ర వాసి ..

గుత్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో పత్తికొండ రోడ్డు బ్రిడ్జి వద్ద రైల్లో నుంచి కిందపడి మహారాష్ట్రకు చెందిన యశ్వంత్ నాగోరావు వనశెట్టి(43)అనే ప్రయాణికుడు మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. అతడు ఏ రైల్లో ప్రయాణించిన వివరాలు తెలియరాలేదన్నారు. ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఆధారంగా మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన వాసిగా గుర్తించామన్నారు. వారి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఉపాధిహామీ ఈసీ బదిలీ

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండల ఉపాధి హామీ ఈసీ భారతిని శెట్టూరుకు బదిలీ చేస్తూ డ్వామా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ కొండన్న శనివారం ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ముగ్గురు టీఏల బదిలీ ఉత్తర్వులు కూడా వచ్చాయన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు తిప్పయ్య గుమ్మఘట్టకు, నరశింహులు కుందుర్పికి, నాగరాజు బుక్కరాయసముద్రానికి బదిలీ అయినట్లు చెప్పారు.

ప్రతిభ చూపినవారికి ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులు

తాడిపత్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చేతిరాతలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసినట్లు పట్టణంలోని కృష్ణాపురం 7వరోడ్డులో ఉన్న ఉషోదయ కోచింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ మధు తెలిపారు. ఈ సెంటర్‌లో పదిరోజులుగా చేతిరాతపై నిపుణుడు శ్రీనివాస్‌తో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని చెప్పారు. శనివారం పరీక్ష పెట్టి ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశామని అన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



చందనలో నష్టపోయిన అరటిపంటను పరిశీలిస్తున్న నాయకులు

యాడికి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రెండు రోజులక్రితం కురిసిన అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని చందన గ్రామంలో అకాల వర్షానికి నష్టపోయిన అరటిపంటను శనివారం ఆయన రైతు సంఘం, సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అకాల వర్షానికి ఈ గ్రామానికి చెందిన రంగప్పనాయుడు అనే రైతు 7ఎకరాల అరటి పంట నష్టపోయారన్నారు. సుమారు 10లక్షల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. అలాగే సూర్యనారాయణరెడ్డి, సత్యంరెడ్డితో పాటు మరికొందరు రైతులు కూడా అరటిపంట తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. ఆ రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఓబిరెడ్డి, ఆదినారాయణయాదవ్, సీనియర్ నాయకుడు శ్రీరాములు, సీపీఐ సీనియర్ నాయకులు గరిడి శివన్న, బండారు రాఘవ, పట్టణ కార్యదర్శి చిన్న కుళ్లాయిరెడ్డి, చందన సీపీఐశాఖ కార్యదర్శి సూరప్ప తదితరులు పాల్గొన్నారు.

- పుట్లూరు: మండలంలో గత నెలలో అకాల వర్షానికి నష్టపోయిన పంటలను శనివారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ. కొండాపురం, అరకటవేముల, కడవకల్లు, ఓబులాపురం గ్రామాల్లో పర్యటించారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్పయాదవ్, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలన్నారు. అనేక పంటలు చేతికి వచ్చే సమయంలో దెబ్బతినడంతో ఆ రైతులు పడ్డ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పద ఏఓపై మూడోసారి విచారణ

- వారంలో చర్యలు తీసుకుంటాం ● విచారణాధికారి డాక్టర్ మజీదాబీ



ఆసుపత్రిలో సిబ్బందిని విచారిస్తున్న విచారణాధికారి మజీదాబీ

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వివాదాస్పదంగా మారిన ఏఓ రాంప్రసాద్ పై శనివారం మూడో సారి విచారణ జరిగింది. ఆస్పత్రిలో మహిళా సిబ్బందిని లైంగికంగా వేధిస్తున్న ఏఓపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల విజయవాడలో సెకెండరీ హెల్త్ డాక్టరేట్ ఆఫ్ కమిషనర్ కార్యాలయం వద్ద స్థానిక సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు ధర్నా చేసి కమిషనర్ డాక్టర్ సిరికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డాక్టర్ సిరి గుంటూరు జిల్లాకు చెందిన వైద్యాధికారి డాక్టర్ మజీదాబీను విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు మజీదాబీ శనివారం ఉదయం గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి వచ్చి సాయంత్రం వరకూ ఆస్పత్రిలోని వైద్యులు, హెడ్‌నర్సులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్ఓలను ఒక్కొక్కరిగా పిలిచి విచారించారు. వారిచేత లిఖితపూర్వకంగా వివరాలను సేకరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని విభాగాల సిబ్బందిని విచారించామన్నారు. ఏఓను విచారణకు పిలిచామని, అతను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే తనకు ప్రాణ హాని ఉందని, మరొక చోట ఎక్కడికైనా పిలిస్తే వస్తానని చెప్పారన్నారు. ఏఓను బుధవారం విజయవాడలో విచారిస్తామన్నారు. నివేదికను కమిషనర్‌కు అందజేస్తామన్నారు. అతడిపై వారంలో తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం



వజ్రకరూరులో ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

ఉరవకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండల కేంద్రంలోని సీతారామ ఆలయంలో శనివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు ఆలయంలోని స్వామి మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. ఇక నవమి ఉత్సవాలకు ఉరవకొండ మండలంలోని రామాలయాలను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. మండలంలోని బూదగవి, లత్తవరం గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. పట్టణంలో అభయాంజనేయస్వామి రథోత్సవాన్ని నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రంగనాథస్వామి ఆలయం ముస్తాబు

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తిలో గల రంగనాథస్వామి ఆలయం శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైంది. దేవాదాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, గ్రామపెద్దలు ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయాన్నే ఆలయంలో వేడుకలను ఘనంగా జరపనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

తాడిపత్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు ఇళ్లస్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ఏపీ బీడీ అండ్ సిగర్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని గాంధీనగర్‌లో శనివారం ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ తాడిపత్రి డివిజన్ కన్వీనర్ ఉమాగౌడ్ మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా బీడీ కార్మికుల బ్రతుకులు మారడం లేదన్నారు. కేవలం రూ.200 కూలీ ఇవ్వడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికులు స్థలాల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేదన్నారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారించాలని కోరుతూ ఈనెల 16వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, యూనియన్ నాయకులు కుళ్లాయప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

తాడిపత్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన మైనర్‌బాలికను నమ్మించి మోసం చేసిన కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణానికి చెందిన రామాంజనేయులుపై శనివారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. గత కొంతకాలంగా ఇన్‌స్టాగ్రాంలో రామాంజనేయులు, మైనర్ బాలిక పరిచయమయ్యారు. అయితే ఆరునెలల క్రితం అతను ఆ బాలికను నమ్మించి వేరే ప్రాంతానికి తీసుకువెళ్లాడు. ప్రస్తుతం కట్నం తేవాలని ఒత్తిడి చేస్తుండడంతో ఆ బాలిక పుట్టింటికి వచ్చి తల్లిదండ్రులకు చెప్పి బోరున విలపించింది. మైనర్‌బాలిక కావడంతో తల్లిదండ్రులు చేసేదేమిలేక పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య



మృతిచెందిన బలరాముడు

యాడికి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాలపల్లిలో బలరాముడు (71) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కొట్టాలపల్లికి చెందిన బలరాముడు గొర్రెల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య సావిత్రమ్మ, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే కొద్దికాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి విషపుగుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి తాడిపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

ఉరవకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండల కేంద్రం శివారులోని వెంకటాంపల్లి పెద్ద తండాలో శనివారం 300లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. నాటుసారా నిర్మూలనలో భాగంగా ఈ దాడులు చేసినట్లు సీఐ శివసాగర్ తెలిపారు. అలాగే 10లీటర్ల నాటుసారాను సీజ్ చేసి తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐలు వెంకటేశం, సుశీలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

9న ప్రజాదర్బార్

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9వ తేదీన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు శనివారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

న్యాయం చేయండి సారూ..

- ఎమ్మెల్యే అశ్మిత్‌కు భూనిర్వాసితుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

తాడిపత్రి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అనంతపురం- బుగ్గ రహదారి విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డికి బాధితులు విన్నవించారు. ఎమ్మెల్యేను శనివారం వారు పట్టణంలోని నివాసంలో కలిసి మాట్లాడారు. రోడ్డు విస్తరణలో తాము భూములు, ఇళ్లు కోల్పోయామని, అయితే అందులో కొందరికే పరిహారం అందించారని, చాలామందికి ఇవ్వలేదని వాపోయారు. అందరికీ పరిహారం అందించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్ వినోద్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని కోరారు. బాధితులకు తప్పకుండా న్యా యం చేస్తామని కలెక్టర్ చెప్పారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో ఈనెల 7న రైతు సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన రాస్తారోకో వాయిదా వేసినట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాజారామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, యుగంధర్, నాగేంద్ర, బుగ్గ, యర్రగుంటపల్లి గ్రామాల భూ నిర్వాసితులు ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బ్రిడ్జి మంజూరు



బ్రిడ్జి నిర్మాణానికి కొలతలు వేస్తున్న దృశ్యం

తాడిపత్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని వంకపై బ్రిడ్జి మంజూరు చేయించి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఎన్నికల్లో చేసిన వాగ్దానం నెరవేర్చుకున్నారని మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తాడిపత్రి నుంచి ఇగుడూరు బ్రాహ్మణపల్లి మీదుగా బుగ్గరోడ్డులోకి వెళ్లే రహదారిపై బ్రాహ్మణపల్లి కొత్తూరు, పాతూరు మధ్యలో వంక ఉంది. దాంతో ఎన్నో ఏళ్ల నుంచి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే ఈ వంక పెద్దఎత్తున పారుతుండ డం వల్ల ఆ గ్రామాల ప్రజలు ఎక్కడిక్కడే నిలబడి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందువల్ల అశ్మిత్‌రెడ్డి ఎన్నికల సమయంలో వంకపై బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇప్పుడు మాట నిలబెట్టుకుంటున్నారని, సర్పంచు సత్యనారాయణరెడ్డి, గ్రామస్థులు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు శనివారం కొలతలు సైతం తీసుకెళ్లారని, బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే తమకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

రైతులకు పరిహారం పంపిణీ

బొమ్మనహాళ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామ పరిధిలో ఉన్న స్పాంజ్‌ఐరన్ కర్మాగారం నుంచి వెలువడే కాలుష్యం వల్ల పంటలు నష్టపోయే రైతులకు శనివారం ఆ ఫ్యాక్టరీ యాజమాన్యం పరిహారం పెంచి చెక్కులు పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా అరకొరగా పరిహారం అందించేవారు. దీంతో పెంచాలని డిమాండ్ చేస్తూ.. రైతులు పలు ఆందోళనలు చేయడంతో ఎట్టకేలకు ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించింది. ఎకరానికి రూ. 2వేల నుంచి రూ.5 వేలు వరకు పెంచి ఇచ్చారు. ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్లు సర్వేష్, విజయ్, యుగంధర్, సీపీఐ, రైతు సంఘం నాయకులు రైతులు పాల్గొన్నారు.

ప్రబోధానంద జయంతి

తాడిపత్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొలమడలో గల ప్రబోధానందస్వామి ఆశ్రమంలో శనివారం ప్రబోధానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి: సీపీఎం

గుత్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహనిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు స్వాధీన పరచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో నేమతాబాద్ వద్ద గత నిర్మిస్తున్న టిడ్కో గృహాలను శనివారం ఆయన పలువురు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో 300 మంది లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల నిర్మాణాల పనులు చేపట్టారన్నారు. నిర్మాణం పూర్తయ్యే దశలో వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ తర్వాత ఈ ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. దీంతో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన చెందారు. కొత్తప్రభుత్వమైనా పూర్తిదశలో ఉన్న గృహాల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, నాయకులు రమేష్, మల్లికార్జున, మల్లేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

- ఊరూ వాడా ఘన నివాళి



ఉరవకొండలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



కూడేరులో చిత్రపటం వద్ద కొబ్బరికాయ కొడుతున్న సర్పంచ్ లలితమ్మ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోసైతం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కేకులు కట్ చేశారు. అన్ని పార్టీల నాయకులు, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు , అధికారులు, విద్యార్థి సంఘాల నాయకులు, స్వచ్ఛందసంస్థల వారు నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత బాబూ జగ్జీవన్ రామ్‌కే దక్కిందన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, ఉప ప్రధానిగా, సంఘ సంస్కర్తగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



కళ్యాణదుర్గంలో ప్రజావేదిక వద్ద టీడీపీ నాయకుల నివాళి



గుత్తి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు..



గుంతకల్లులో విగ్రహం వద్ద టీడీపీ శ్రేణులు..



రాయదుర్గం టీడీపీ కార్యాలయంలో..